ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు

■ పేట్ బషీరాబాద్‌లో ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సర్వేనంబర్ 25/1, 25/2లో పేట్ బషీరాబాద్ రంగారెడ్డిబండను సందర్శిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మల్కాజిగిరి ఆర్‌డీఓ శ్యాంప్రకాశ్ తదితరులు

కుత్బుల్లాపూర్, జూలై 23 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్‌లోని సర్వే నంబర్ 25/1,25/2లలో స్థలాలను మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ఆయా సర్వేనంబర్‌లో కొంతమంది వ్యక్తులు అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులపై సందర్శించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే శాఖాపరమైన చర్యలు తప్పవని, ఇప్పటి వరకు ఆయా ప్రాంతాల్లో వెలిసిన నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. కాగా, సర్వే నంబర్ 25/2లో ఓ వ్యక్తి చేపడుతున్న నిర్మాణంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. దాదాపుగా హెచ్ఎండీఏ ఆదీనంలో భూముల్లో ఏండ్ల తరబడి అదే భూముల్లో తిష్టవేయడం గమనార్హమని, నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టడంతో పాటు దీనికి టౌన్‌ప్లానింగ్ నుంచి అనుమతులు ఏ ప్రాతిపదికన జారీ అయ్యాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదే అంశంపై సమగ్ర విచారణ జరిపి తుది నివేదికను త్వరితగతిన అందించాలని మల్కాజిగిరి ఆర్‌డీఓ శ్యాంప్రకాశ్, కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ రెహమాన్‌తోపాటు ఆర్ఐ రేణుకలను ఆదేశించారు. ఈ మేరకు వెనువెంటనే సర్వేయర్ ఆయా స్థలాల్లో సర్వే చేపట్టారు.

బడ్జెట్ కేటాయింపులో అసమానత్వం

మియాపూర్, జూలై 23 : ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ రెండు రోజుల సమావేశం మియాపూర్‌లోని ఎంఏ నగర్ పార్టీ కార్యాలయంలో అనీల్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఓంకార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాల మధ్య తీవ్ర అసమానతలను ప్రదర్శించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాదగోని రవి, వనం సుధాకర్, ఉపేందర్‌రెడ్డి, సుకన్య, వెంకన్న, రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'కేఎల్ఎం' యాజమాన్యంపై కేసు నమోదు చేయండి

దుండిగల్, జూలై 23:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ లాల్‌సాహెబ్‌గూడకు చెందిన దారం పద్మావతి, ఆమె కుమారుడు దారం నర్సింగరావుపై దాడికి పాల్పడిన కేఎల్ఎం యూనివర్సిటీ యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్ డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి సీపీఐ నేతలు మంగళవారం సూరారం పోలీస్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్‌ని కలిసి ఫిర్యాదు చేశారు. ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, సీపీఐ నాయకులు చంద్రమోహన్, బాలయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో కార్పొరేటర్ పూజలు

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడం బోనాల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎల్లమ్మతల్లిని శాకాంబరి దేవిగా అలంకరించగా, అలంకరణకు అవసరమైన కూరగాయలను కార్పొరేటర్ సమకూర్చాడు. బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు. *–కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 23*

యూకే సదస్సుకు హెచ్‌సీయూ విద్యార్థి ఎంపిక

ప్రజ్ఞ ప్రియదర్శిని దాస్(ఫైల్)

కొండాపూర్, జూలై 23: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి ప్రజ్ఞ ప్రియదర్శిని దాస్ యునైటెడ్ కింగ్‌డమ్ నార్విక్‌లోని ది సైన్స్‌బరీ లాబోరేటరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ప్లాంట్ –మైక్రోబ్ ఇంటరాక్షన్స్ ఫర్ ఎర్లీ కెరీర్ రీసెర్చర్స్' కాన్ఫరెన్స్‌కు ఎంపికైనట్లు వర్సిటీ యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. కాగా, ప్రియదర్శిని దాస్ వర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్లాంట్ సైన్సెస్ విభాగంలో పీహెచ్‌డీ అభ్యసిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన 20 మంది ఎర్లీ కెరీర్ రీసెర్చర్స్‌లో ఒకరిగా ప్రియదర్శిని ఎంపికైంది. ఈ సదస్సు యూకేలో జూలై 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కొనసాగనున్నది.

బీరప్పనగర్‌లో పారిశుధ్య సమస్యలేకుండా చూడాలి

జగద్గిరిగుట్ట, జూలై 23 : నివాస ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని జగద్గిరిగుట్ట బీరప్ప నగర్ వాసులు కోరారు. బస్తీ సమీపంలో చెత్త పేరుకుపోయి సమస్య నెలకొనడంతో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంగళవారం గాజుల రామారం ఉపకమిషనర్ మల్లారెడ్డి కాలనీలో పరిశీలన చేపట్టారు. తొలగించడంతోపాటు సకాలంలో పనులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నేతలు కృష్ణగౌడ్, సుధాకర్, పాపిరెడ్డి, వేణుయాదవ్, రాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి గొల్ల కృష్ణ సస్పెన్షన్

దుండిగల్, జూలై 23: భారతీయ జనతా పార్టీ (బీజేపీ), నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి గొల్లకృష్ణను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ జేకే.శేఖర్‌యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గొల్ల కృష్ణ గత కొన్ని రోజులుగా బీజేపీ పార్టీ అంతర్గత విషయాలపైనా, నాయకులపైనా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు సోషల్ మీడియాలో వ్యతిరేక పోస్టులు పెడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో అతన్ని పార్టీ నుంచి మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ డా.మల్లారెడ్డి తొలగించినట్లు శేఖర్ యాదవ్ పేర్కొన్నారు.

సర్కారు పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎమ్మెల్యే గాంధీ

యూనిఫాంలు అందించిన సందర్భంగా విద్యార్థులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, జూలై 23: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు పాఠశాలలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. ఇప్పటికే వీటిలో ప్రవేశాల పరంగా ఎంతో పోటీ నెలకొంటున్నదన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌ను ఎమ్మెల్యే మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత విద్య, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు వంటి ఎన్నో వసతులను కల్పిస్తూ విద్యను ప్రభుత్వ అందిస్తున్నట్లు, విద్యార్థులు వినియోగించుకుని ఉత్తమ భవిష్యత్‌ను పొందాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం మస్తాన్‌వలీ, కాంగ్రెస్ నేతలు నాయినేని చంద్రకాంత్‌రావు, హరినాథ్, లక్ష్మీనర్సయ్య, సత్యనారాయణ, శ్యామ్, చంద్రమోహన్, దుర్గ, లక్ష్మయ్య, శివ, శ్రీను, సోములు రమేశ్, పంతులు, భాస్కర్, రాజు, మల్లన్న, యాదగిరి పాల్గొన్నారు.

– హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో డ్రైనేజీ, రహదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేఅరెకపూడి గాంధీకి వినతిపత్రం సమర్పించారు. కాలనీవాసులు అందె నర్సింహ, శ్రీనివాస్‌రావు, సీతారాముడు, యాదిరెడ్డి, మదన్‌మోహన్, కృష్ణమూర్తి, వెంకట్రామిరెడ్డి, బాబూరావు, సత్యనారాయణ, రామనాథం, ప్రకాశ్, శంకర్‌రావు పాల్గొన్నారు.

– కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని మాజీ కార్పొరేటర్ రుద్రరాజు జానకిరామరాజు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

పచ్చదనంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జీడిమెట్ల డివిజన్ ప్రసూననగర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కేపీ, కాలనీవాసులు

కుత్బుల్లాపూర్,జూలై 23 : పచ్చదనంతోనే మానవాళి మనుగడకు దోహదం చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్క నాటి దానిని సంరక్షించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి కె.నాగేంద్రబాబు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, సుధాకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎల్లాగౌడ్, విజయహరీశ్, కాలే నగేశ్, సంజీవ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సాగర్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు పరిశుభ్రంగా ఉండాలి

జడ్సీ ఉపేందర్‌రెడ్డి

పారిశుధ్య పనులపై సూచనలిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, జూలై 23: పారిశుధ్య నిర్వహణ పనులు పకడ్బందీగా జరగాలని, వీటిపై ఎటువంటి నిర్లక్ష్యం తగదని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. జోన్ పరిధిలోని ప్రతి అండర్ పాస్, ఫ్లై ఓవర్ పైనా ప్రతి నిత్యం స్వీపింగ్ ప్రక్రియను చేపట్టాలని, అవి శుభ్రతకు కేరాఫ్‌గా నిలవాలాన్నారు. జోన్ పరిధిలోని ఖాజాగూడ, రాయదుర్గం, శిల్పావ్యాలీ, టెలికం నగర్, ఇందిరానగర్, రోలింగ్ హిల్స్, ప్రశాంత్‌నగర్, మస్జీద్ బండ సహా పలు ఇతర ప్రాంతాల్లో మంగళవారం పారిశుధ్య పనులను జడ్సీ ఉపేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారులను స్వీపింగ్ చేసిన వెంటనే పోగయ్యే చెత్తను తొలగించాలని, ఎట్టి పరిస్థితుల్లో రహదారులపై వదిలివేయవద్దన్నారు. వర్షాకాలం నేపథ్యంలో రహదారులపై నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని, అనుబంధ విభాగాలకు సమాచారం అందించాలన్నారు. ఐటీ పరిశ్రమలకు వేదికగా ఉన్న శేరిలింగంపల్లి జోన్‌ను పరిశుభ్రతలో ప్రథమ స్థానంలో నిలిపేలా సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని జడ్సీ స్పష్టం చేశారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ నగేశ్ నాయక్ ఉన్నారు.

ఐఏఎస్ స్మితాసబర్వాల్‌ను సస్పెండ్ చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 23 : దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని న్యాశక్తి దివ్యాంగుల సంస్థ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వేల్పుగొండ వెంకటస్వామి డిమాండ్ చేశాడు. సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్‌పై ఎక్స్‌లో అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన స్మితాసబర్వాల్ దివ్యాంగులను కించపరిచేలా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు ప్రత్యేక చట్టాలతో రిజర్వేషన్‌లు కల్పిస్తుంటే.. ఉన్నతమైన పదవిలో ఉన్న మీరు కించపరిచేలా మాట్లాడటం సరికాదన్నారు. ఎక్స్‌లో చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని.. దివ్యాంగుల సమాజానికి క్షమాపణ చెప్పాలని కోరారు.

చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు

జడ్సీ అపూర్వ చౌహాన్

మూసాపేట సర్కిల్‌లో అధికారులతో కలిసి చెరువులను పరిశీలిస్తున్న జడ్సీ అపూర్వ చౌహాన్

కేపీహెచ్‌బీ కాలనీ/మియాపూర్, జూలై 23: చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోని చెరువులలో గుర్రపుడెక్కను పరిశీలించారు. జడ్సీ మాట్లాడుతూ..చెరువుల్లో పేరుకపోయిన గుర్రపుడెక్కను ఆవాసాలుగా మార్చుకుని దోమలు వృద్ధి చెందుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. జంట సర్కిళ్ల పరిధిలోని ముళ్లకత్వ, కాముని, సున్నం, మైసమ్మ, నల్ల, అంబీర్ చెరువులలో గుర్రపుడెక్కను తొలగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఈ చిన్నారెడ్డి, డీఈలు రమేశ్, కృష్ణయ్య, ఈఈలు సత్యనారయణ, గోవర్ధర్ గౌడ్, ఏఎంహెచ్‌వోలు సాల్మన్‌రాజ్, మమత అధికారులు ఉన్నారు.

వివేకానందనగర్‌లో..

మియాపూర్: వివేకానందనగర్ డివిజన్‌లో కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ చౌహాన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావుతో కలిసి మంగళవారం పర్యటించారు. మాధవరం కాలనీ కల్వర్టు అప్రోచ్ రోడ్డు, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ సెంట్రల్ మీడియంలో పచ్చదనం, చిత్తారమ్మ ఆలయంలో అభివృద్ధి పనులు, వర్షపు నీటి నిల్వ ప్రాంతాలను కార్పొరేటర్ రోజాదేవి జడ్సీకి వివరించారు.

– నివాస పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చందానగర్ సర్కిల్ వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ కోరారు. జడ్సీ ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని కల్యాణ మండపంలో పరిసరాల పరిశుభ్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. 61 పాఠశాలలకు చెందిన 380 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్

మియాపూర్, జూలై 23: మియాపూర్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో రాంగ్‌రూట్ డ్రైవింగ్ నిరోధంపై పోలీసులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఠాణా పరిధిలోని దీప్తిశ్రీనగర్ యూ టర్న్ వద్ద అపసవ్య దిశలో వాహనాలను నడుపుతున్న 10 వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ మాట్లాడుతూ.. అపసవ్య దిశలో వాహనాన్ని నడపటం ప్రమాదకరమని, తమతో పాటు ఎదుటి వారు ప్రమాదం బారిన పడుతారన్నారు. వీటి నిరోధానికి యూటర్న్‌ల వద్ద స్పెషల్ డ్రైవ్ చేస్తున్నట్లు, ఉల్లంఘించే వారి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు ప్రశాంత్ తెలిపారు. ఎస్ఐలు మల్లేశ్, సుభాష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

దుండిగల్, జూలై 23 : రాష్ట్రంలోని ప్రతి రైతుకు ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీని వర్తింపజేయాలని బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి అన్నారు. బౌరంపేట్ సొసైటీకి చెందిన పలువురు రైతులతో కలిసి ఆయన మంగళవారం తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంక్(టిస్కాబ్)చైర్మన్ రవీందర్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్ జ్యోతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బౌరంపేట సొసైటీకి చెందిన 632 మంది రైతులకు గాను కేవలం 11 మందికి మాత్రమే ఇప్పటివరకు రుణ మాఫీ జరిగిందని పేర్కొన్న ఆయన అర్హులైన వారందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఏసీఎస్ బౌరంపేట వైస్‌చైర్మన్ డైరెక్టర్ నల్తూరి కృష్ణ, సెక్రటరీ సయ్యద్ అసదుల్లా, డైరెక్టర్ఈదులకంటి శ్రీనివాస్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

వీధి కుక్కల పేరిట రాజకీయం చేయరాదు



సమస్యలను తెలుసుకుంటున్న చైర్మన్ సన్న శ్రీశైలం, కమిషనర్ శ్రీహరి

కుత్బుల్లాపూర్, జూలై 23: కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల పేరిట కొంతమంది వ్యక్తులు రాజకీయానికి తెరలేపుతున్నారని, వీధి కుక్కల విషయంలో మున్సిపాలిటీ నుంచి అనుక్షణం తగు చర్యలు తీసుకుంటున్నామని కొంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. మంగళవారం నార్త్ ఎన్‌సీఎల్ కాలనీలో కమిషనర్ కె.శ్రీహరి, స్థానిక కౌన్సిలర్ ప్రవీన్‌తో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పార్కింగ్ ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

కొండాపూర్, జూలై 23 : షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్‌లలో అక్రమంగా పార్కింగ్ ఫీజులు వసూల్ చేస్తే కఠిన చర్యలు తప్పవని శేరిలింగంపల్లి సర్కిల్–20 డీసీ రజినీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సర్కిల్ పరిధిలోని అట్రియం మాల్‌ను టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. మాల్‌లో పరిశుభ్రత, పార్కింగ్ ఫీజులపై ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రభుత్వ జీవోకు వ్యతిరేకంగా పార్కింగ్ ఫీజుల వసూళ్లకు పాల్పడే వారిపై ప్రత్యేక నజర్ పెట్టాలన్నారు. జీవో ప్రకారం మాత్రమే రుసుం తీసుకోవాలని, దానికి విరుద్ధంగా వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని మాల్ నిర్వాహకులకు తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మెహరా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాటసారులను ఢీకొట్టిన ఆటో.. భార్యభర్తలకు గాయాలు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై23: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న బాటసారులను ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్రగాయాలైన ఘటన కేపీహెచ్‌బీకాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై మణ్యం తెలిపిన ప్రకారం.. మియాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ప్రపుల్ల మాస్కే, జయశ్రీ (41) భార్యభర్తలు ఇద్దరూ పిల్లలతో కలిసి జీవిస్తున్నారు. ఈనెల 20న రాత్రి 10గంటలకు జేఎన్‌టీయూహెచ్ రోడ్డులోని హైదర్‌నగర్ కరాచీ బేకరీ వద్ద కుటుంబసభ్యులంతా కలిసి రోడ్డును దాటి.. సర్వీస్ రోడ్డులో నడుచుకుంటూ వెళుతున్నారు.ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని ఆటో.. భార్యభర్తలను ఢీకొట్టింది. దీంతో భర్తకు పెదవులు, మణికట్టు వద్ద స్వల్ప గాయాలు కాగా.. జయశ్రీ దూరంగా పడపోవడంతో తీవ్రగాయాలతో చెవి, ముక్కు, తల నుంచి రక్తస్రావం అయ్యింది. వెంటనే వారిని సమీపంలోని వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యచికిత్సలందించారు. జయశ్రీ పరిస్థితి విషమంగా ఉందని, ఆ ఆటో డ్రైవర్‌ను గుర్తించి శిక్షించాలని భర్త పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మంగళవారం కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో యువకుడికి..

మియాపూర్‌లోని జనప్రియానగర్‌కు చెందిన తోటకూర శ్రీనివాస్ వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా.. కొడుకు చందు(22) మీసేవా సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఈనెల 22న రాత్రి కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ హోటల్ వద్దకు స్నేహితుడిని కలిసేందుకు వచ్చిన చందు రోడ్డు పక్కన నిలబడి మాట్లాడుతుండగా.. వెనుక నుంచి కారు ఢీకొట్టింది.దీంతో కాలుకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. మంగళవారం తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల వితరణ

పెద్దలకు గుర్తుగా సాయం చేయడం అభినందనీయమని పలువురు అన్నారు. వీవీ ట్రాన్స్‌ఫార్మర్ యజమాని వినోద్ తన తండ్రి నారాయణరావు సంస్మరణ సందర్భంగా మంగళవారం గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. గాంధీనగర్ ఇండస్ట్రియల్ అధ్యక్షుడు స్వామిగౌడ్, హెచ్ఎం అనురాధ, జల్దాలక్ష్మీనాథ్, తిమ్మయ్య, జగన్, రాంచదర్ తదితరులు పాల్గొన్నారు. *– జగద్గిరిగుట్ట, జూలై 23*

■ అమరులకు నివాళి..

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావులతో కలిసి ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, పల్లె రాజేశ్వర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కాలేరు వెంకటేశ్, గంగుల కమలాకర్, చింతా ప్రభాకర్, కేపీ వివేకానంద్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కుర్మయ్య గారి నవీన్ కుమార్‌లు అమరవీరుల స్థూపం వద్ద అమరులకు నివాళుర్పించి అసెంబ్లీ సమావేశాలకు వెళ్లారు. *– కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 23*

■ మహిళల ఉచిత బస్సు సౌకర్యాన్ని మరింత మెరుగుపర్చాలి

రాష్ట్రంలో మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యాన్ని మరింత మెరుగుపర్చడంతో పాటు మరిన్ని బస్సు సర్వీసులను పెంచాలని ఐఎఫ్‌టీయూ–పీఓడబ్ల్యూ–పీడీఎస్‌యూ నేతలు కోరారు. మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జి.అనురాధ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు, పీఓడబ్ల్యూ హైదరాబాద్ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కార్యదర్శి భారతి, ఐఎఫ్‌టీయూ నాయకులు పద్మ ఉచిత బస్సుల్లో మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రికి వివరించారు. కార్యక్రమంలో నవీన్, శ్యామ్, వజ్రమణి తదితరులు పాల్గొన్నారు. *– దుండిగల్, జూలై 23*

ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఫంక్షన్‌హాల్స్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు సూచించారు. మంగళవారం పీఎస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు విధిగా వినోద అనుమతులు, సీసీ కెమెరాలు, ఈవెంట్ అనుమతులు, సౌండ్‌సిస్టమ్, పార్కింగ్, డ్రోన్, ఫైర్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్దంగా కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, రాంనారాయణ, సురేందర్‌రెడ్డితో పాటు ఆయా ఫంక్షన్‌హాళ్ల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు. *–కుత్బుల్లాపూర్, జూలై 23*

బాచుపల్లిలో బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్)ఆవిర్భావం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని పలు పరిశ్రమల్లో జరిగిన కార్యక్రమాలకు బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు, ఈపీఎఫ్ బోర్డ్ సభ్యులు మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌లతో కలిసి జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డీస్‌ల్యాబ్ బీఎంఎస్ నాయకులు రాజు, శ్రీరాం, శ్రీనివాసరావు, నరేందర్, పర్వతరెడ్డి, మైలాన్ కార్మికులు, పలువురు బీఎంఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. *– దుండిగల్, జూలై 23*

వంగిన విద్యుత్ స్తంభాలు తొలగించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 23 : ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీకాలనీలో విద్యుత్ ఏడీఈ సూర్యప్రకాశ్‌తో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడతూ... కాలనీలో నాలుగు విద్యుత్ స్తంభాలు వంగిపోయాయని, ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే డివిజన్ పరిధిలో పలుచోట్ల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రాంనర్సయ్య, కృష్ణాచారి, స్వామి, ఎల్‌వీనాయుడు, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి

దుండిగల్, జూలై 23: కుత్బుల్లాపూర్ సర్కిల్,సుభాశ్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ,స్వాగత్‌నగర్‌లో రోడ్డును కబ్జా చేస్తూ ఇంటికి అడ్డుగా ఏర్పాటు చేసిన ప్రైవేట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇంటిని ఆనుకుని దౌర్జన్యంగా ఏర్పాటు చేసిన సదరు ట్రాన్స్‌ఫార్మర్ ఎంతో ప్రమాదకరంగా మారుతుందన్నారు. ప్రజలు ఇబ్బందులను గుర్తించి వెంటనే దానిని తొలగించాలని స్థానికులు మంగళవారం కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ వి.నరసింహకు వినతిపత్రం అందజేశారు. ఈ దారి వెంబడి రోజు వందల మంది స్కూల్ పిల్లలు తిరుగుతూ ఉంటారని, స్కూల్ పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశముందన్నారు.

బౌరంపేట్‌లోని తాగునీటి పైప్‌లైన్ పనులు పరిశీలన

తాగునీటి పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు, కౌన్సిలర్లు

దుండిగల్, జూలై 23: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్‌లో మిషన్ భగీరథ నూతన పైప్‌లైన్ పనులతోపాటు రోడ్డు పనులను మంగళవారం కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా నిర్మిస్తున్న పనులు పూర్తి కాలేదని, దీంతో రోడ్డు పూర్తిగా పాడైందని, గ్రామంలో నిత్యం స్కూల్ బస్సులు తిరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బౌరంపేట్‌లోని మల్లన్నగుడి వద్ద నుంచి డీపీఎస్ స్కూల్ వరకు నూతన రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, ఎస్‌వీ.సురేందర్‌రెడ్డి, మురళీ,పీసరి క్రిష్ణరెడ్డి,జలమండలి మేనేజర్ సౌమ్య, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అక్కాతమ్ముడు అదృశ్యం

హారిక(ఫైల్)

ఫణీంద్ర(ఫైల్)

శేరిలింగంపల్లి, జూలై 23: ఇంట్లో చెప్పకుండా అక్కాతమ్ముడు అదృశ్యమైన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన ప్రకారం... కొండాపూర్ మసీదుబండా ప్రభుపాద కాలనీలో నివసించే అడ్డాల నరేశ్(32) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2022 ఫిబ్రవరి 10వ తేదీన తన మేనకోడలైన హారిక(20)ను వివాహం చేసుకున్నాడు. ఇంట్లో హారికతోపాటు ఆమె తమ్ముడు ఫణీంద్ర(19) సైతం ఉంటున్నాడు. గత ఫిబ్రవరి 20వ తేదీన అక్కా హారిక, తమ్ముడు ఫణీంద్ర చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తమకోసం వెతికితే చనిపోతామని హారిక లేఖ రాసి పెట్టి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది.. భర్త వారి గురించి ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆలస్యంగా ఇచ్చిన ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.